నేటి కందం-నేటికి అందం

రోటరు డామున హాకీ
పోటీలో కప్పు బొందు పూనికతోడన్
మేటిగ క్రీడాకారులు
చాటించిరి భారతీయ శక్తిని భువికిన్ !!

(రోటర్ డామ్ లో జరిగిన ప్రపంచ హాకీ పోటీల్లో భారత దేశం అద్భుత విజయాన్ని సాధించి యావత్ప్రపంచాన్నీ ఆశ్చర్యచకితం చేసింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక


పవర్ పాలిట్రిక్సుల్లో
ప్రభుత్వం పాచికాట
చీల్చేవేస్తూ ప్రతిపక్షుల
చంపుతున్న పులి వేట.
చెప్పేవి ప్రజాస్వామ్య
స్వచ్ఛ రాజనీతులు
తవ్వేది కుతంత్రాల
తలమునక గోతులు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ ఆదివారం 21-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:245 పేజీలు:6 వెల: రూ.1/-


# కొత్త ఓటరు నమోదుకు అవకాశం లేదన్న ప్రచారం అవాస్తవం



హైదరాబాద్, జూన్ 20:(నేటినిజం ప్రతినిధి) తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్త ఓటరు నమోదుకు అవకాశం లేదంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

హైదరాబాద్‌లో శనివారం మీడియాతో మాట్లాడిన సుదర్శన్‌రెడ్డి, కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 25 నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని వెల్లడించారు. జూలై 25లోపు ఆ ఫారాలను సమర్పించాలని సూచించారు. అదే ఫారం ద్వారా కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం కూడా ఉంటుందని స్పష్టంచేశారు.

రాష్ట్రంలో ఇప్పటికే 80 శాతం పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన పత్రాలను కూడా గుర్తింపు ఆధారాలుగా అనుమతిస్తామని చెప్పారు. 2002లోపు ఓటరు జాబితాతో అనుసంధానమైన వారికి అదనపు పత్రాల అవసరం ఉండదని వెల్లడించారు.

బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చామని, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకం కూడా జరుగుతోందని తెలిపారు. బీఎల్‌వోలు సేకరించే వివరాలను ముసాయిదా ఓటరు జాబితాలో పొందుపరుస్తామని చెప్పారు.

అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేసే వరకు ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియపై రాజకీయ పార్టీలతో కూడా సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు.

# కాల్పుల విరమణకు తూట్లు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులు

న్యూ ఢిల్లీ, జూన్ 20: ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన గంటల వ్యవధిలోనే దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఈ వైమానిక, డ్రోన్ దాడుల్లో కనీసం ఐదుగురు మృతిచెందగా, పలువురు గాయపడినట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

లెబనాన్‌లోని నబతియెహ్ ప్రాంతంలోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, డ్రోన్లతో దాడులకు దిగింది. ఈ ఘటనలో అనేక నివాస భవనాలు ధ్వంసమయ్యాయి. కాల్పుల విరమణ అమల్లోకి రావడంతో శాంతి నెలకొంటుందని ఆశించిన స్థానికుల్లో తాజా దాడులు తీవ్ర ఆందోళనకు దారితీశాయి. ఇక.. ఈ దాడులకు ముందు రాత్రి కూడా అదే ప్రాంతంలో భారీ బాంబుదాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో కనీసం 16 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడగా, పలువురు శిథిలాల కింద చిక్కుకున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు.

అమెరికా, ఖతార్, ఇరాన్ దేశాల మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య శుక్రవారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్టు అమెరికా అధికారులు ప్రకటించారు. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఈ అగ్రిమెంట్ అమల్లోకి వచ్చిందన్నారు. దక్షిణ లెబనాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించడం, పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలకు ఊతమివ్వడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అయితే.. ఒప్పందం అమల్లోకి రాగానే దాడులు కొనసాగడం వల్ల శాంతి ప్రక్రియపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశమున్నట్టు పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షాల హెచ్చరిక

## -పిడుగులు, ఉరుములతో వానలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్, జూన్ 20:తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం మరోసారి పూర్తిగా మారబోతోంది. రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఇప్పటి వరకు అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురవగా, నేటి నుంచి విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండనుంది. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

ఇక తెలంగాణలో కూడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో ప్రభావం అధికంగా ఉండనుంది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్‌లో పగటిపూట సాధారణ వాతావరణం ఉన్నప్పటికీ రాత్రి వేళల్లో ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. పిడుగుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా, అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.

# 'ఇక గ్రూపులు లేవు.. షిండే నేతృత్వంలోనిదే అసలైన శివసేన'

## – అమిత్ షా సంచలన వ్యాఖ్యలు

కొల్హాపూర్, జూన్ 20: మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పెను తుఫాను చెలరేగింది. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే - ఐబి) పార్టీలో తీవ్ర తిరుగుబాటు వ్యూహాలు నడుస్తున్నాయనే వార్తల నడుమ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇవాళ (శనివారం) చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. శివసేనలో ఇక ఎలాంటి గ్రూపులు లేవని, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే నేతృత్వంలో నడుస్తున్నదే ఏకైక అసలైన శివసేన అని ఆయన స్పష్టం చేశారు.

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

సభను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ.. 'గతంలో మనం ఏకనాథ్ షిండే పేరును ప్రస్తావిస్తూ 'శివసేన షిండే గ్రూప్' అని పిలవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఎలాంటి గ్రూపులు లేవు. కేవలం ఒకే ఒక్క శివసేన ఉంది. అది షిండే నేతృత్వంలోనిదే' అని ప్రకటించారు.

అంతకుముందు కొల్హాపూర్‌లోని ప్రముఖ మాతా అంబాబాయి ఆలయాన్ని సందర్శించిన అమిత్ షా, అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే ఆలయ ఆధునీకీకరణ, కారిడార్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధి, వారసత్వం) అనే సంకల్పంతోనే దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం జరుగుతోందని, మహారాష్ట్రలోని అన్ని జ్యోతిర్లింగాలు, శక్తి పీఠాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని అమిత్ షా ఈ సందర్భంగా కొనియాడారు.

# సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 1-డే కౌంట్‌డౌన్ ఈవెంట్




హైదరాబాద్, జూన్ 20: 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేకంగా 1-డే కౌంట్‌డౌన్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీలు లక్ష్మణ్, ఈటెల రాజేందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 12వ ప్రపంచ యోగా దినోత్సవం కౌంట్ డౌన్ కార్యక్రమానికి అందరికీ స్వాగతమని అన్నారు. రేపు(ఆదివారం) 200 దేశాలు అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో పాల్గొంటాయని తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోల్‌కతాలో జరిగే యోగా వేడుకల్లో పాల్గొంటారని కిషన్ రెడ్డి తెలిపారు. గత 12 ఏళ్లుగా కోల్‌కతాలో యోగా దినోత్సవ వేడుకలు జరగలేదన్నారు. యోగా డే సెలబ్రేషన్స్ కోసం నెల రోజులుగా అందరూ కలిసి ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. గత ఏడు సంవత్సరాలుగా యోగా వేడుకలకు 24 గంటల ముందు కౌంట్ డౌన్ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు.

**భారత్ అందించిన గొప్ప కానుక యోగా: వెంకయ్య నాయుడు**

రేపు యోగా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతోందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. యోగా ఒక మతానికి పరిమితం కాదన్నారు. యోగా చేస్తే సమగ్ర మనిషిగా మారుతారని తెలిపారు. ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప కానుక యోగా అని చెప్పుకొచ్చారు. సర్వమానవ, సౌభ్రాతృత్వం, సర్వతోముఖాభివృద్ధికి యోగా అవసరమన్నారు. మానవ చైతన్యానికి నిదర్శనం యోగా అని పేర్కొన్నారు. పూర్వీకులు రంగరించి మనకు అందించిన జీవన విధానం యోగా అని.. ఆరోగ్య, ఆధ్యాత్మిక, మానసిక ఒత్తిడి, స్థైర్యాన్ని ఇచ్చేది యోగా అని అన్నారు. యోగా అనేది మనిషికి, ప్రకృతిమాత అందించిన గొప్ప వరమన్నారు. ప్రకృతి ఒడిలో ప్రజలు జీవించాలని.. ఆరోగ్యమే మహాభాగ్యమన్న మాటను నిజం చేయాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు.

**యోగా శుభాకాంక్షలు: ఈటెల**

ప్రపంచానికి జీవన విధానాన్ని అందించిన దేశం భారత్ అని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. దేశాన్ని విశ్వ గురు స్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ నిలబెట్టారని తెలిపారు. అందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ అవసరం: లక్ష్మణ్**


ప్రపంచానికి యోగాను అందించిన దేశం భారత్ అని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ప్రాచీన సంస్కృతిలో భాగమే యోగా అని తెలిపారు. ఆధ్యాత్మిక, ఆరోగ్య చింతన ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు.

**అందరూ యోగా చేయాలి: రాంచందర్ రావు**

నరేంద్రమోదీ 12 సంవత్సరాల క్రితం యోగాను ప్రపంచానికి పరిచయం చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. ప్రపంచ దేశాల్లో యోగాను చేస్తున్నారని.. యోగా వలన డిప్రెషన్ నుంచి బయటకు వస్తారని అన్నారు. పిల్లలు, తల్లిదండ్రులు అందరూ యోగా చేయాలన్నారు.

**యోగా అంటే నాకు పిచ్చి: నవీన్ పొలిశెట్టి**

యోగా కార్యక్రమనికి వచ్చిన అందరికీ స్వాగతమని సినీ హీరో నవీన్ పొలిశెట్టి తెలిపారు. 'నాకు యోగా అంటే చాలా పిచ్చి. నేను ఒకే ఆసనంలో 5 గంటలు ఉండగలను. అదే శవాసనం' అంటూ అందరినీ నవ్వించారు. తనకు ఒక యాక్సిడెంట్ జరిగిందని, దాంతో తీవ్రమైన బ్యాక్ పెయిన్ ఉండేదని తెలిపారు. అందులో నుంచి బయటకు రావడానికి యోగా చాలా ఉపయోగపడిందని నవీన్ పొలిశెట్టి వెల్లడించారు.



# ఆస్తుల పరిరక్షణ కోసమే హైడ్రా.. డిజాస్టర్ కోసం కాదు: రంగనాథ్



హైదరాబాద్, జూన్ 20: హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరూ బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్ష పదివేల కోట్ల ఆస్తులు వెనక్కు తీసుకువచ్చామని వివరించారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించద్దని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై వచ్చేవి అన్ని అసత్యాలే అని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆస్తులను కాపాడటంతో హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని వెల్లడించారు.. పార్టీలకు అతీతంగా పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదానికి వంద గుడిసెలు పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉందా లేదా పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని అన్నారు.

హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోతాయని తెలిపారు. ఈ నెల 9వ తేదీన కురిసిన వర్షానికి హైదరాబాద్ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుడదండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకు పోతామని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తుందని రంగనాథ్ పేర్కొన్నారు.

# SIRపై అప్రమత్తంగా ఉండాలి.. లేకపోతే నష్టపోతాం: మంత్రి తుమ్మల నాగేశ్వరావు

ఖమ్మం జిల్లా, జూన్ 20: 'SIR' పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు(శనివారం) SIR పై ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని..

ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు. ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం లేదని వ్యాఖ్యానించారు.

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు శాతం ఓట్ల తేడాతోనే గెలవడం జరిగిందని మంత్రి తెలిపారు. SIR కార్యక్రమంలో 55 శాతానికి పైగా ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నారు.

మమతా బెనర్జీ, స్టాలిన్ ఓడిపోవడానికి కారణాలు, పరిస్థితిలు గుర్తు చేసుకోవాలని నాయకులకు సూచించారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారికి జీవన్మరణ సమస్య తప్పదన్నారు. బీజేపీ కావాలని ఓట్ల తొలగిస్తోందని, మరో పార్టీ మరోలా చేస్తోందని రకరకాల ప్రచారాలు వస్తున్నాయన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని తెలిపారు. అధికారులకు సహకరించాలని, వారితో కలిసి సమన్వయం చేసుకొని ఓట్లను కాపాడుకోవాలని నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.

# ఒకే ఫుడ్ స్టాల్‌లో ఆహారం తిని.. 59 మంది ఆసుపత్రి పాలు

ముంబై, జూన్ 20: ఒక ఈటరీ షాపులో ఫుడ్ తిన్న సుమారు 59 మంది వ్యక్తులు అనారోగ్యానికి గురయ్యారు. వాంతులు, విరోచనాలతో ఆసుపత్రిలో చేరారు. ఆ షాపులో తిన్న ఆహారం విషతుల్యం కావడంతో వారంతా అస్వస్థత చెందినట్లు వైద్యాధికారి తెలిపారు. మహారాష్ట్రలోని భివాండిలో ఈ సంఘటన జరిగింది. ఒక ఫుడ్ స్టాల్‌లో పిజ్జా వంటివి తిన్న కొందరు వ్యక్తులు అనారోగ్యం పాలయ్యారు. కడుపులో నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. తొలుత గురువారం 11 మందిని ఇందిరా గాంధీ మెమోరియల్ ఆసుపత్రిలో చేర్పించారు. అదే షాపులో ఆహారం తిన్న మరి కొందరు కూడా శుక్రవారం అస్వస్థత చెందారు. వారిని కూడా అదే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో మొత్తం 59 మంది అక్కడ చికిత్స పొందుతున్నారు.

కాగా, ఆ ఫుడ్ స్టాల్‌లోని ఆహారం విషమయం కావడంతో అక్కడ తిన్న సుమారు 59 మంది ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలతో ఆసుపత్రిలో చేరినట్లు వైద్యాధికారి తెలిపారు. వారంతా ఒకే షాపులో ఆహారం తిని అస్వస్థత చెందినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రత, సంబంధిత అధికారులు ఆ ఫుడ్ స్టాల్ నుంచి నమూనాలు సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# అమ్మ నడక నేర్పితే నాన్న నడత నేర్పుతాడు !

## (21 జూన్ "ప్రపంచ పితృ దినోత్సవం" సందర్భంగా)

కుటుంబ వృక్షానికి కనిపించే కాండం అమ్మ అయితే కనిపించని తల్లి వేరు నాన్న. కుటుంబాభివృద్ధి యంత్రానికి ఇం'ధనం' నాన్న. సంతానాభివృద్ధికి మార్గదర్శి తండ్రి. కుటుంబ గౌరవ దీపానికి చమురు నాన్న. పుస్తక జ్ఞానం లేకపోయినా లోకజ్ఞానం బోధించే మేధావి నాన్న. నాన్న వేలు పట్టుకొని నడక, నడత నేర్పిన పిల్లలు రేపటి తరానికి బాధ్యత కలిగిన పౌరులుగా ఎదుగుతారు. నాన్న భుజం వంశ భారాన్ని మోసే అలసట ఎరుగని వాహనం. కుటుంబ దేహానికి వెన్నెముక నాన్న. అమ్మతో కలిసి అమృతాన్ని వితరణ చేసే అమాయక త్యాగజీవి నాన్న. నాన్న ఓ ఆత్మీయ నేస్తం, ఓ ఆపన్నహస్తం. నాన్న జీవితం కుటుంబ దేహానికి రక్షణ కవచం. తండ్రి త్యాగం అనన్య సామాన్యం, ప్రశంస కోరని జీవితం. పిల్లల కంటికి రెప్ప నాన్న. బోధనలో ఓ మౌన రుషి. సాధనలో నైపుణ్య అనంత శక్తివంతుడు. నాన్న చెమట ఇంటి దీపానికి చమురు, కాలి బూడిదలుతూ తరిగే నూలు వత్తి. నాన్న మనసు దూదంత మెత్తన, పాలంతో తెల్లన. అవసరమైతే ఆయన ఆవేశం పిల్లలపై కుమ్మరించే శ్రేయో వర్షం. కుటుంబ లతకు పందిరి నాన్న. ఎదిగే సంతాన మొక్కలకు తనో ట్రీగార్డ్. నాన్న శ్వాస కుటుంబ క్షేమమే. కుటుంబ కాయానికి నాన్నే ప్రాణవాయువు. తను కరుగుతూ కుటుంబంలో వెలుగులు పంచే కొవ్వత్తి నాన్న. నాన్న జీవితం కుటుంబ సంక్షేమానికే అంకితం. ప్రేమల ఊటబాయి, అనురాగ బంధాల అక్షయపాత్ర నాన్న. తన తనువు అలసిపోయినా, తన పిల్లల నవ్వుల వర్షంలో శక్తిని తిరిగి పుంజుకొని బేషరతుగా సర్వస్వం ధారపోసే నాన్న జీవితం హిమాలయ శిఖరమంత మహోన్నతం. అయిన జీవితం ఓ ఆదర్శ దీపస్తంభం. పిల్లల పెంపకంలో ఓ పరిపాలనాదక్షుడే కాదు, పిల్లలు దారి తప్పినపుడు ఆయన ఓ చండశాసనుడు కూడా.

ప్రపంచ పితృ దినోత్సవం–2026 ఇతివృత్తం :

నాన్న ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట జూన్ మాసంలో 3వ ఆదివారం రోజున, అనగా 21 జూన్ 2026 "ప్రపంచ పితృ దినోత్సవం" లేదా "వరల్డ్ ఫాదర్స్ డే" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ పితృ దినోత్సవం–2026 ఇతివృత్తంగా "తండ్రులు: బలమైన మార్గనిర్దేశనాలు, భవిష్యత్తు నిర్మాణాలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. మన హిందూ సమాజంలో కుటుంబానికి పెద్ద దిక్కు నాన్న. అమ్మ నాన్నలు ఆది దేవతలు, అలసిపోని ధన్యజీవులు. కుటుంబ బండికి రెండు చక్రాలు అమ్మానాన్నలు. కుటుంబ బతుకు బండిలో పయనించే చిన్నారులు పిల్లలు. నాన్న త్యాగాలను గుర్తు చేసుకోవడం, వారి కాళ్లు కడిగి నెత్తిన పోసుకొని, మనసారా కృతజ్ఞతలు తెలియజేయడం, పుష్ప మాలలతో కొలుచుకోవడం, కానుకలు అందజేయడం, కుటుంబమంతా కలిసి గడపడం, నాన్నతో కలిసి సంతోషంగా గడపడం, చిన్ననాటి జ్ఞాపకాల మూట అయిన ఆల్బమ్ చూసుకుంటూ బాల్యాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రపంచ పితృ దినోత్సవ వేదికలు పని చేస్తాయి. రెక్కలొచ్చిన బిడ్డలు జీవనోపాధులను వెతుక్కుంటూ వెళ్లి పోవడాన్ని చూస్తూ, గుండె నిండా కన్నీటిని దాచుకొని, వీడ్కోలు చేప్పే నాన్న మనో లోతులు ఎవరికీ అందనంత దూరం. పాశ్చాత్య సంస్కృతిలో నాన్నను కలిసే రోజుగా పితృ దినోత్సవం ఉపయోగపడినా, భారతీయ సంస్కృతిలో నాన్నను మరిచిన రోజుండదు, తలవని క్షణ ముండదు.

అమ్మానాన్నలు ఆది దేవతలు:

అమ్మ జన్మనిస్తే, నాన్న ఆ జీవితానికి పరమార్థం ప్రసాదిస్తాడు. అమ్మ ఇంటిలో తొలి అడుగులు వేయిస్తే, నాన్న ప్రగతి పథం చూపు మార్గదర్శి. అమ్మ తొలి పలుకులు నేర్పితే, నాన్న జీవిత పాఠాల విలువల రసం నూరి పోస్తాడు. నాన్న లేనిదే పుట్టుక లేదు. అమ్మనాన్నల అన్యోన్యతే పిల్లల సంతోషాల కోవెల. ఆది గురువు అమ్మ, లోక జ్ఞాన బోధకుడు నాన్న. నాన్న స్థానం ఎవరూ భర్తీ చేయలేని నిరుపమాన అద్వితీయ పాత్ర. నాన్న లేని ఇల్లు గాఢాంధకారం. చీకట్లను పారద్రోలే ఉషోదయ కిరణం నాన్న. కుటుంబ పుస్తకంలో నాన్నే అక్షరం, పదం, భావం. నాన్న త్యాగానికి తత్సమాన్ని లేదు, నాన్న పాత్రకు ప్రత్యామ్నాయం లేదు. తండ్రి మదిలో పిల్లలు మెదలని రోజుండదు. పిల్లలు తింటే నాన్న కడుపు నిండుతుంది. ఆపదలో అమ్మ అందరి ముందు కన్నీరు పెడితే, నాన్న తెర వెనుక దుఃఖిస్తాడు. తండ్రి కంటికి కునుకుండదు, పురుషుడి జన్మకు నాన్న పదమే పరిపూర్ణం. పిల్లల రెక్కలకు ఎగరడం నేర్పే బుద్ధిజీవి నాన్న. నవ్వుల పరదాలతో బాధల్ని కప్పేసి, కన్నీటిని చెమటగా మార్చి, తన వారి కోసం జీవించే ధన్యజీవి పిత. నాన్న హృదయం ఆకాశమంత మహోన్నతం, సాగరమంత లోతైన అవయవం.

నాన్నే మన సూపర్ హీరో :

నాన్న రుణం తీర్చుకోలేనిది. నాన్న అయిన తర్వాతనే నాన్న విలువ తెలుస్తుంది, ఆయన మానసిక స్థితి అర్థం అవుతుంది. బాధ్యత వలలో చిక్కినా, నిబ్బరంగా కనిపిస్తూ, సవాళ్లను అధిగమిస్తూ, రక్తాన్ని చెమటగా మార్చుతూ, అవిశ్రాంతంగా ఒంటరి పోరాటం చేసే త్యాగశీలా నాన్న. వృద్ధాప్యంలో పిల్లల ఉన్నతే నాన్నకు సంతోష కారణం. వృద్ధాప్యంలో నాన్నకు మనం ఊత కర్ర అవుదాం. మన ముందు నిలిచిన అమ్మానాన్నలు ఆదర్శ దైవాలు. నాన్నే మన సూపర్ హీరో, ఆయన లేని జీవితం జీరో. నాన్న లేని జీవితం చుక్కాని లేని నావ. అమ్మానాన్నలు సృష్టించిన హద్దులు లేని ప్రేమ సామ్రాజ్యంలో సంతోషంగా, స్వేచ్ఛగా, బాధ్యతతో ఎదగడం నేర్చుకుందాం. నిత్యం ఆది దేవతలను మదిలో తలుచుకొని దిన చర్యను ప్రారంభిద్దాం.

నేటి సమాజంలో అమ్మనాన్నలను ఇంట్లోంచా గెంటేయడం, వృద్ధాశ్రమాల్లో బలవంతంగా చేర్పించడం, పితృ దేవతను చులకనగా చూడడం లాంటి అమానవీయ పోకడలు చూడాల్సి రావడం దురదృష్టకరం.



–మధుపాళీ
9949700037

# 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' కింద సుమారు రూ. 2,400 కోట్ల విలువైన ప్రోత్సాహకాలు పంపిణీ చేసిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 20:ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన లబ్ధిదారులు, పరిశ్రమల ప్రతినిధులు, భాగస్వాములనుద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ప్రసంగించారు. భారత యువతకు సాధికారత కల్పించడానికి, దేశవ్యాప్తంగా ఉపాధి కల్పనను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం పీఎం–వీబీఆర్‌వై అమలులో భాగంగా... అన్ని రంగాలకు సామాజిక భద్రతా పరిధిని విస్తరించడంలో ఒక కీలక మైలురాయిగా నిలిచే ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ.2,400 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను ఈ రోజు పంపిణీ చేశారు. ఈ ప్రోత్సాహకం దేశవ్యాప్తంగా 15 లక్షల ఉపాధి అవకాశాల కల్పనకు తోడ్పడింది.

ఫ్రాన్స్, స్లోవేకియా దేశాల పర్యటనలో భాగంగా జీ–7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొని, ప్రపంచ నాయకులతో సమావేశమై తిరిగి వచ్చిన వెంటనే ఇక్కడ ఏర్పాటు చేసిన సభనుద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగించారు. భారత యువత తమ ప్రతిభ, నైపుణ్యాలు, సామర్థ్యానికి ప్రపంచవ్యాప్తంగా అపూర్వ గుర్తింపును పొందుతున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. భారతీయ యువత సామర్థ్యాలకు ప్రపంచస్థాయిలో గుర్తింపు పెరుగుతూనే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. యువత తమ సామర్థ్యాన్ని విజయంగా మలచుకునే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

"ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కేవలం ఒక ఉపాధి పథకం కంటే చాలా ఎక్కువ. ఇది తమ తొలి ఉద్యోగంలో చేరుతున్న యువత ఆకాంక్షలను బలోపేతం చేయడంతో పాటు, పరిశ్రమకు–కార్మిక వర్గానికి మధ్య ఒక బలమైన వారధిని నిర్మించడానికి రూపొందించిన కార్యక్రమం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. సాధారణంగా అనేక పథకాలు ఉద్యోగులపైనో లేదా యజమానులపైనో మాత్రమే దృష్టి సారిస్తాయని, ఈ కార్యక్రమం ఏకకాలంలో ఇద్దరికీ మద్దతునిస్తుందని ఆయన పేర్కొన్నారు. తమ వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించే యువతకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించే సంస్థలనూ ప్రోత్సహిస్తుందని అన్నారు.

ఈ పథకం సాధించిన విజయాలను వివరిస్తూ... ఇప్పటవరకు దాదాపు 70 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించామని, అదేసంఖ్యలో తొలిసారిగా ఉద్యోగంలో చేరిన వారిని సామాజిక భద్రత పరిధిలోకి తీసుకు వచ్చామని శ్రీ మోదీ తెలిపారు. దాదాపు 20 లక్షల మంది యువత తమ తొలి ఉద్యోగంలో ఆరు నెలలు పూర్తి చేసుకున్నారని, ఈ మైలురాయిని పూర్తి చేసిన సుమారు 10 లక్షల మంది లబ్ధిదారులు ఇప్పటికే ఈ పథకం కింద ప్రోత్సాహకాలను అందుకున్నారని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా రూ. 2,000 కోట్లకు పైగా బదిలీ చేశామన్నారు. ఈ మద్దతు కేవలం ఆర్థిక సహాయం కంటే ఎక్కువని వర్ణిస్తూ... ఇది యువత కష్టానికి దేశం ఇస్తున్న గుర్తింపును, వారి భవిష్యత్తుపై దేశానికి ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఈ పథకం కింద ఉపాధి అవకాశాలు కల్పించిన సంస్థలు, వ్యాపార సంస్థల భాగస్వామ్యం పట్ల ప్రధానమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. "ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఉపాధి కల్పన ఊపందుకుంటుంది. యువతకు అవకాశాలు లభించడం, పరిశ్రమలకు ప్రోత్సాహం అందడం, ఉపాధి కల్పన జాతీయ కర్తవ్యంగా మారడం సాధ్యమయ్యే నూతన భారత్‌కు ఈ కార్యక్రమం ప్రతిబింబం వంటిది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

దేశ జనాభా బలాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ... ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో యువత గల దేశాల్లో భారత్ ఒకటని, అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణం మన యువత ఆకాంక్షలు, నైపుణ్యాలు, సామర్థ్యాలతో విడదీయరాని విధంగా ముడిపడి ఉందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ప్రతి యువ భారతీయుడు తన ప్రతిభ, ఆశయాలకు అనుగుణంగా పురోగమించగలరని నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు. గత పన్నెండేళ్లుగా, ఉపాధికి సంబంధించిన ప్రతి మార్గాన్నీ బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేసిందని ప్రధానమంత్రి తెలిపారు. "మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణల నుంచి తయారీ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, అంతరిక్ష సాంకేతికత, అంకురసంస్థల వరకు అన్ని రంగాల్లో గణనీయ కృషి జరిగింది. మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్, స్థానిక ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లే ప్రయత్నాలు, మిషన్ మాను ఫ్యాక్చరింగ్ వంటి కార్యక్రమాలు ఉపాధి, స్వయం ఉపాధి రెండింటికీ మార్గాలను విస్తరించాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వం పెట్టిన రూ.12 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి, ఉపాధి కల్పనకు బలమైన పునాది వేస్తోందని శ్రీ మోదీ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ముద్రా యోజన కింద అందించిన రూ.33 లక్షల కోట్లకు పైగా సహాయం, లక్షలాది మంది యువత తమ సొంత సంస్థలను స్థాపించుకోవడానికి వీలు కల్పించిందని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారత గురించి ప్రస్తావిస్తూ... 10 కోట్లకు పైగా మహిళలు స్వయం సహాయక బృందాలతో అనుబంధం కలిగి ఉన్నారని, 3 కోట్లకు పైగా మహిళలు లక్‌పతి దీదీలుగా ఎదిగారని ఆయన తెలిపారు. పీఎం స్వనిధి, పీఎం విశ్వకర్మ వంటి కార్యక్రమాలు చిన్న పారిశ్రామికవేత్తలు, వీధి వ్యాపారులు, సాంప్రదాయ కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేశాయని ఆయన జోడించారు.


అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు కొత్త ఉపాధి అవకాశాలను ఎలా సృష్టిస్తున్నాయనడానికి, వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ రంగం ఒక చక్కటి ఉదాహరణ అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఔషధాల పంపిణీ, వ్యవసాయ సంబంధిత అనువర్తనాల నుంచి స్వామిత్వ పథకం కింద భూమి మ్యాపింగ్, రక్షణ కార్యకలాపాల వరకు... డ్రోన్ టెక్నాలజీని ఎక్కువగా వినియోగించడం ద్వారా యువ భారతీయులకు కొత్త ఉపాధి మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయని ఆయన తెలిపారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పరివర్తన ప్రభావం గురించి మాట్లాడుతూ... గిగ్ ఎకానమీ, ప్లాట్‌ఫామ్ ఆధారిత సేవలు, కంటెంట్ క్రియేషన్, టెక్నాలజీ ఆధారిత సంస్థల ఆవిర్భావాన్ని ఉపాధికి, ఆదాయానికి ప్రధాన వనరులుగా పేర్కొన్నారు. "ఒకప్పుడు ఊహించడం కూడా సాధ్యంకాని ఎన్నో అవకాశాలు ఇప్పుడు లక్షలాది మంది యువ భారతీయులకు ఆచరణీయ జీవనోపాధిగా మారాయి. ఇదే పరివర్తన భారత శక్తిమంతమైన అంకుర సంస్థల వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తోంది, ఇది ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, ఉద్యోగాలను సృష్టిస్తూ, దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతూనే ఉంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

గత దశాబ్ద కాలంలో భారత అంకుర సంస్థల వ్యవస్థ సాధించిన అద్భుతమైన వృద్ధిని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఒకప్పుడు దేశంలో కేవలం 500 అంకురసంస్థలు మాత్రమే ఉండగా... నేడు దేశంలోని దాదాపు ప్రతి జిల్లాలో అంకుర సంస్థల ఏర్పాటుతో ప్రస్తుతం 2 లక్షలకు పైగా నవోదిత అంకురసంస్థలు పనిచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. "భారత భవిష్యత్తుపై ప్రపంచ సమాజం ఆశాభావంతో ఉంది. ఇక్కడి యువత సామర్థ్యాలపై అపారమైన విశ్వాసాన్ని కలిగి ఉంది" అని శ్రీ మోదీ అన్నారు. తన ఇటీవలి ఫ్రాన్స్ పర్యటనను ప్రస్తావిస్తూ... కృత్రిమ మేధ, అంతరిక్ష సాంకేతికత, హరిత ఇంధనం, బయోటెక్నాలజీ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో భారతీయ అంకుర సంస్థలను, ప్రపంచ పెట్టుబడిదారులను ఒకచోట చేర్చిన "ఇండియా ఇన్నోవేట్స్" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. భారత ఆవిష్కరణల వ్యవస్థపై అంతర్జాతీయంగా పెరుగుతున్న ఆసక్తిని, భవిష్యత్ సాంకేతికతలను తీర్చిదిద్దడంలో విస్తరిస్తున్న భారత్ పాత్రను ఇటువంటి కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో భారత్ చురుగ్గా కొత్త వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకుంటోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలు భారతీయ పరిశ్రమలకు కొత్త మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారతీయ నిపుణులకు సరికొత్త అవకాశాలనూ సృష్టిస్తున్నాయని ఆయన గమనించారు. "ప్రపంచం భవిష్యత్ ఆర్థిక వ్యవస్థ కోసం సిద్ధమవుతుండగా, భారత్ దానికి నాయకత్వం వహించడానికి సిద్ధమవుతోంది. దేశాలు భవిష్యత్ సాంకేతికతల వైపు ఎక్కువగా పయనిస్తున్న తరుణంలో, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలతో తన యువతను సన్నద్ధం చేయడంపై భారత్ దృష్టి సారించింది" అని ఆయన స్పష్టం చేశారు.

గత పన్నెండేళ్లలో భారత ఉపాధి వ్యవస్థలో వచ్చిన ఒక ముఖ్యమైన పరివర్తనను ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఈ పరివర్తనకు తరచుగా తక్కువ శ్రద్ధ లభిస్తున్నప్పటికీ, అభివృద్ధి చెందిన భారత్ దిశగా సాగే ప్రయాణానికి ఇది చాలా కీలకమైనదన్నారు. "ఉద్యోగాన్ని భద్రత, గౌరవం, సామాజిక రక్షణతో అనుసంధానించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో)ను ఆధునీకరించడానికి, పింఛను వ్యవస్థలను సరళీకృతం చేయడానికి, లక్షలాది మంది కార్మికులకు ఆరోగ్య బీమా, సరసమైన ఆరోగ్య సంరక్షణను విస్తరించడానికి సాంకేతికతను వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్మిక సంస్కరణలకూ ఇదే తత్వం మార్గదర్శకంగా ఉంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.




# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి..

ఆదిలాబాద్, జూన్ 20:నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కన్నాపూర్ గ్రామం సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కడెం మండల కేంద్రానికి చెందిన జాలిగాం వినయ్ కుమార్ (24) అనే యువకుడు మృతి చెందాడు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వినయ్ కుమార్ ద్విచక్ర వాహనంపై కడెం నుంచి కొండుకూరు గ్రామం వైపు వెళుండగా కన్నాపూర్ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వినయ్ కుమార్ ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



# 'యువజన సాధికారత, పీఎంవీబీఆర్‌వై'లపై వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధాని

న్యూ ఢిల్లీ, జూన్ 20:కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ రాసిన ఒక వ్యాసాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రజలతో పంచుకున్నారు.

యువతకు అపారమైన అవకాశాలు కల్పించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడమే 'వికసిత్ భారత్' లక్ష్యమని ఈ కథనం తెలియజేస్తోంది. ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై).. దేశంలో భారీ స్థాయిలో ఉపాధి అవకాశాల సృష్టికి, మార్పునకు బాటలు వేయడమే కాకుండా దేశ నిర్మాణంలో యువత క్రియాశీల భాగస్వాములు కావడానికి ఒక చోదక శక్తిగా నిలుస్తుందని ఈ వ్యాసంలో కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

"యువతకు అపారమైన అవకాశాలు కల్పించడం ద్వారా వారిని సాధికారిత వైపు నడిపించడమే 'వికసిత్ భారత్' ప్రధాన లక్ష్యం. దేశంలో భారీ స్థాయిలో ఉపాధి అవకాశాల సృష్టికి, మార్పునకు పీఎంవీబీఆర్‌వై బాటలు వేయనుంది. ఈ పథకం మన యువత దేశ నిర్మాణంలో క్రియాశీల భాగస్వాములు కావడానికి ఒక అద్భుత చోదక శక్తిగా కూడా నిలుస్తుంది.

కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ రాసిన ఈ వ్యాసం ప్రతి ఒక్కరూ తప్పక చదవండి."

# పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..



ఆదిలాబాద్, జూన్ 20: జైపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం అలాగే గంగిపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ త్వరగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణతో కలిసి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విదంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

వంటశాలలో శుభ్రత, నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అదే విధంగా ఇటీవల గంగిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మూత్రశాల నిర్మాణాలను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చి వేసిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ ఆస్తులు నష్టం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 21న కోల్‌కతాలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలకు ప్రధానమంత్రి సారథ్యం

న్యూఢిల్లీ, జూన్ 20:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 20, 21 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో పర్యటిస్తారు. జూన్ 20న మధ్యాహ్నం సుమారు 3:45 గంటలకు, హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో పశ్చిమబంగ దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, దేశానికి అంకితం చేస్తారు. మరికొన్ని అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన కూడా చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగిస్తారు.

జూన్ 21న ఉదయం సుమారు ఆరున్నర గంటలకు కోల్‌కతాలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు.

దేశీయంగా రూపుదిద్ది నిర్మించిన మూడు నౌకాదళ నౌకలు.. ఐఎన్ఎస్ దునాగిరి, ఐఎన్ఎస్ సంశోధక్‌తో పాటు ఐఎన్ఎస్ అగ్రేలను ప్రధానమంత్రి ఉదయం సుమారు 9:15 గంటలకు కోల్‌కతా లోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఓడరేవులో ప్రారంభిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ఒక సభలో ఆయన ప్రసంగిస్తారు.

పశ్చిమబంగ దినోత్సవ కార్యక్రమాల్లో ప్రధానమంత్రి పాల్గొంటారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీతో ముడిపడిన చారిత్రక ప్రాధాన్యం కలిగిన హుగ్లీలోని తారకేశ్వర్‌లో రాష్ట్ర స్థాయి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

“పశ్చిమ బెంగాల్: వారసత్వం, సద్భావన, అభివృద్ధి”ని ఈ సంవత్సరం పశ్చిమబంగ దినోత్సవ కార్యక్రమాలకు ముఖ్యాంశంగా ఎంపిక చేశారు. ఈ ఇతివృత్తం రాష్ట్ర సాంస్కృతిక వైభవానికీ, సామాజిక భావనకీ, అభివృద్ధి ప్రధాన ఆకాంక్షలకీ ప్రతీకగా నిలుస్తోంది.

అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ఈ కార్యక్రమంలో ప్రారంభించి, దేశ ప్రజలకు అంకితమిస్తారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. రైల్వేలు, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మత్స్య పాలన, పశు సంవర్ధక రంగాలకు సంబంధించిన ఈ కార్యక్రమాలు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను పటిష్ట పరిచి, జీవనోపాధిని మెరుగుపరిచి, రైతుల సంక్షేమాన్ని విస్తరించడంతో పాటు సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేస్తాయి.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎమ్-కిసాన్) 23వ వాయిదాను ప్రధాని పంపిణీ చేయనున్నారు. ఈ వాయిదాలో భాగంగా, రూ.18,880 కోట్ల కన్నా ఎక్కువ సొమ్మును దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు.

ఒక్క పశ్చిమ బెంగాల్‌లోనే రూ.900 కోట్ల కన్నా ఎక్కువ మొత్తాన్ని 45 లక్షలకు పైగా లబ్ధిదారులకు జమ చేయనున్నారు. దీంతో ఈ పథకం కింద రాష్ట్రంలో ఇంతవరకు పంపిణీ చేసిన సొమ్ము రూ.15,000 కోట్లకు చేరుకోనుంది. 2019లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇంతవరకు దేశం నలుమూలలా రూ.4.46 లక్షల కోట్లకు పైగా అందించారు.

పశ్చిమ బెంగాల్‌లో పలు కీలక కేంద్ర వ్యవసాయ పథకాలను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఈ పథకాల్లో ‘ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన’, డిజిటల్ వ్యవసాయ మిషన్‌కు చెందిన ‘అగ్రి స్టాక్’, ‘ప్రకృతి వ్యవసాయ జాతీయ మిషన్’, ‘ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన’ వంటివి ఉన్నాయి.

పశ్చిమ బెంగాల్‌లో ‘ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన’ (పీఎమ్ఎఫ్‌బీవై)ని ప్రధాని ప్రారంభిస్తారు. దీంతో ప్రపంచంలో అతి భారీ పంట బీమా పథకం ప్రయోజనాలు రాష్ట్ర రైతులకు అందుబాటులోకి వస్తాయి. 2026-27లో, పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 50 లక్షల మంది రైతులకు, సుమారు 14 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమికీ బీమా రక్షణను సమకూర్చి చెప్పుకోదగిన మొత్తంలో ప్రీమియం సబ్సిడీ రూపంలో అందించడమే కాకుండా సుమారు రూ.28,140 కోట్ల బీమా విలువ కలిగివుండే పంటలను సంరక్షించడం ఈ కార్యక్రమం లక్ష్యాలు.

డిజిటల్ వ్యవసాయ మిషన్‌లో భాగంగా అగ్రిస్టాక్‌ను ప్రధాన మంత్రి ప్రారంభిస్తారు. ఎరువుల పంపిణీ, కిసాన్ క్రెడిట్ కార్డులు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీలతో పాటు కనీస మద్దతు ధర వ్యవస్థ పరిధిలో సేకరణ వంటి ప్రామాణిక వ్యవసాయ సంబంధిత సేవలను ఈ డిజిటల్ వేదిక అందిస్తుంది. ఈ కార్యక్రమం వ్యవసాయంలో డిజిటల్ సేవల్ని బలోపేతం చేయడంతో పాటు రైతులకు అందజేయదలిచిన సేవలను సమర్థంగా అందించేందుకు తోడ్పడుతుంది.

పశ్చిమ బెంగాల్‌లో ప్రకృతి వ్యవసాయ జాతీయ మిషన్‌ను కూడా ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. ఎలాంటి రసాయనాలనూ ఉపయోగించకుండా భారతీయ సాంప్రదాయిక సాగు పద్ధతుల్నీ, దీర్ఘకాలం పాటు మనుగడలో ఉండే సాగు పద్ధతుల్నీ ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష్యం. 2026-27కు ఆమోదించిన వార్షిక ప్రణాళికలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో 346 ప్రకృతి వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేస్తారు. వీటితో 17,300 హెక్టార్ల ప్రాంతాన్ని పర్య వేక్షించవచ్చు. బయో-ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తారు. పర్యావరణానుకూల వ్యవసాయ పద్ధతులను అనుసరించడాన్ని పటిష్ఠపరిచేందుకు ‘కృషి సఖి’ల తోడ్పాటును తీసుకుంటారు.

ప్రధాని పశ్చిమ బెంగాల్‌లో ‘ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన’ (పీఎమ్‌డీడీకేవై)ని కూడా ప్రారంభిస్తారు. ఏకీకృత వ్యవసాయాభివృద్ధి దిశగా తీసుకున్న ఒక ముఖ్య నిర్ణయం ఇది. ఈ పథకాన్ని పురులియా, డార్జిలింగ్, అలీపుర్‌ద్వార్, ఝాడ్‌గ్రామ్‌లలో అమలుచేస్తారు. ఈ పథకంలో భాగంగా.. వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడంపై దృష్టిని కేంద్రీకరిస్తూ, పంటల వివిధకరణనీ, దీర్ఘకాలిక సాగును ప్రోత్సహిస్తూ, పంట కోతల అనంతర కాలంలో మౌలిక సదుపాయాల కల్పననీ, సేద్యపు నీటి సదుపాయాలనీ బలోపేతం చేస్తూ, సంస్థాగత పరపతి లభ్యతను పెంచుతూ, గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర పథకాల మధ్య సమన్వయాన్ని ఏర్పరచడంపై శ్రద్ధ తీసుకుంటారు.

దక్షిణ 24 పరగణాల్లోని ఫ్రేజర్‌గంజ్‌లో ఆధునికీకరించి, సామర్థ్యాన్ని విస్తరించిన ఫిషింగ్ హార్బరునూ, బీర్‌భూమ్‌లోని సైంథియాలో నిర్మాణ పనులు పూర్తి చేసిన ఆధునిక చేపల బజారునూ ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టులతో మత్స్య పాలనకు సంబంధించిన మౌలిక సదుపాయాల బలోపేతంతో పాటు పంట కోతల అనంతర కాలంలో నిర్వహణ మెరుగుపడనుంది. చేపల రైతులకూ, వ్యాపారులకూ మెరుగైన మార్కెటింగ్ కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి.

నాదియా జిల్లా లోని హరింగహాటాలో మేకల పెంపకందారుల కోసం ఏర్పాటు చేసిన ప్రాంతీయ వీర్య ఉత్పాదన ప్రయోగశాలనూ, వీర్య బ్యాంకునూ ప్రధాని ప్రారంభిస్తారు. పశు సంవర్ధకం, పాడి పరిశ్రమ విభాగానికి చెందిన జాతీయ పశుగణ మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు భారతదేశ తూర్పు ప్రాంతాలలో ఈ తరహా మొదటి కేంద్రాలు. ఇవి పశుగణాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో పెంపొందింప చేయడానికీ, జన్యుపరంగా మెరుగుదల, ఉత్పాదకత పెంపులో కీలక తోడ్పాటును అందిస్తాయి.

సుమారు రూ.590 కోట్ల ఖర్చుతో నిర్మించిన ప్రధాన రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. హౌరా జిల్లాలో సంక్‌రాయిల్-సంత్రాగాఛీ లింక్ లైన్ ప్రాజెక్టును దేశ ప్రజలకు అంకితం చేస్తారు. ఈ ప్రాజెక్టు భారత తూర్పు ప్రాంతం లో అత్యంత రద్దీగా ఉండే రైల్ కారిడార్లలో ఒకటైన కారిడార్‌లో రద్దీ సమస్యను తగ్గించడంలో ఓ ముఖ్య పాత్రను పోషిస్తుంది. ప్రయాణికుల రైళ్లే కాక సరకు రవాణా రైళ్లు కూడా రాకపోకలను సాఫీగా పూర్తి చేసుకోవడంలో ఈ ప్రాజెక్టు తోడ్పడుతుంది. హౌరాలో 300 పడకలతో ఒక కొత్త డివిజనల్ రైల్వే ఆసుపత్రి నిర్మాణానికి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేస్తారు. ఆధునిక ఆరోగ్యసంరక్షణ కేంద్రాలు, ఉన్నత స్థాయి రోగనిర్ధారణ కేంద్రాలు, విశిష్ట వైద్య సేవలతో పాటు అత్యవసర చికిత్స కేంద్రాలతో కూడిన ఈ ఆసుపత్రి రైల్వే సిబ్బందికే కాకుండా ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యసంరక్షణ సేవల్ని చెప్పుకోదగిన స్థాయిలో మెరుగుపరుస్తుంది.

పూర్వ మేదినీపూర్ జిల్లాలో హౌర్, రాధామోహన్‌పూర్ మధ్య ఒక రోడ్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టు రైలుమార్గంలో, రహదారి మార్గంలో భద్రతను పెంచడమే కాక, రాకపోకలలో అంతరాయాలు చోటుచేసుకోకుండా సహాయపడుతుంది.

ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన (పీఎమ్‌జీ ఎస్‌వై-ఎఎఎ)లో భాగంగా రూపొందించిన 49 రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభిస్తారు. మొత్తం 315 కి.మీ. కి పైగా పొడవైన ఈ ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్ లో వివిధ జిల్లాల్లో విస్తరించి, గ్రామీణ అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయి. మార్కెట్లకూ, విద్యాసంస్థలకూ, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకూ చేరుకోవడంలో ఉపయోగపడతాయి. సమతుల ప్రాంతీయాభివృద్ధికీ తోడ్పాటును అందిస్తాయి.

ఈ ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్‌లో మౌలిక సదుపాయాల రంగాన్ని బలోపేతం చేయడం, రైతులకు సాధికారతను సమకూర్చడం, జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు కొత్త ఆర్థిక అవకాశాలను కల్పించే దిశగా కీలక పాత్రను పోషిస్తాయి. ఈ కార్యక్రమాలు సమ్మిళిత వృద్ధినీ, ఆధునిక మౌలిక సదుపాయాలనీ, దీర్ఘకాల ప్రాతిపదికన అభివృద్ధినీ ప్రోత్సహిస్తూ ‘వికసిత్ పశ్చిమ బెంగాల్’కు బాట వేసి, ‘వికసిత్ భారత్’ దార్శనికతను సాకారం చేయడానికి దోహదపడతాయి.

దేశం ఈ నెల 21న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటించనుండగా, కోల్‌కతా లోని రెడ్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి ప్రధానమంత్రి సారథ్యం వహించనున్నారు. వేల మంది యోగాభ్యాసకులతో కలిసి కామన్ యోగా ప్రోటోకాల్ కార్యక్రమంలో ఆయన పాలుపంచుకుంటారు. సభను ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారు.

## ఉపాధ్యాయులుగా మారిన ఎస్పీ నరసింహా..




నల్గొండ, జూన్ 20: నేరాల నియంత్రణకై సమీక్షలు బిజీ బిజీ కార్యక్రమాలతో ఉండే జిల్లా ఎస్పీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చూడగానే రిలాక్స్ అయ్యారు. పాఠశాల వసతులు, సమస్యలపై ఆరా తీసిన అనంతరం తన పూర్వపు వృత్తిని గుర్తు చేసుకుంటూ.. విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తరధ్రువం.. దక్షిణధ్రువం.. అంటూ సాంఘికశాస్త్రం పాఠాలను ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు చెప్పారు .

తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలనందే తన కుమారుడు రుత్విక్ ను చేర్పించిన జూనియర్ అసిస్టెంట్ హరితను అభినందించి సన్మానించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన అనుభవిజ్ఞులైన నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తారని తెలిపారు. కావున తల్లిదండ్రులు విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం కోసం ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఎస్పి ఆకాంక్షించారు. చెడు అలవాటులకు దూరంగా ఉండాలని మంచి స్నేహితులను మంచి పుస్తకాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు నైపుణ్యంతో విద్యార్థులకు పాఠాలు బోధించాలని సర్కారు బడుల ప్రాముఖ్యతను సామర్థ్యాన్ని తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, పట్టణ సిఐ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపులో పెద్దపల్లికి రాష్ట్ర స్థాయి గుర్తింపు..

కరీంనగర్, జూన్ 20: విద్యా ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచింది. ఇందుకు గాను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాశాఖ అధికారి శారద లకు విశిష్ట గౌరవం లభించింది. శుక్రవారం హైదరాబాద్ ఎల్.బి స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

విద్యా రంగంలో నాణ్యతాభివృద్ధి, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల, పాఠశాలల సమర్థ నిర్వహణలో పెద్దపల్లి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలిపినందుకు ఈ గుర్తింపు లభించింది. జిల్లా విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యారంగ భాగస్వాములు, సిబ్బంది అందరికీ జిల్లా యంత్రాంగం అభినందనలు తెలిపారు. జిల్లా విద్యారంగ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషి చేయడం వల్లే ఈ గౌరవం సాధ్యమైందని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.

## యూరియా కొరత లేదు -విప్ విజయరమణ రావు

కరీంనగర్, జూన్ 20: జిల్లాలో యూరియా కొత్త లేదని రైతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణా రావు తెలియజేశారు. శుక్రవారం రాత్రి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల మరియు జిల్లా వ్యవసాయ అధికారులతో వానాకాలం సీజన్ దృష్ట్యా పలు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రారంభమైన వర్షాకాలం సీజన్లో పంటల సాగు వివరాలు, యూరియా అవసరం మరియు ప్రస్తుత నిలువలు, యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం గురించి వ్యవసాయ అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుత వానకాలం సీజన్లో పంట అంచనాలకు గాను ఎలినో ప్రభావంతో వరి పంట సాగు తగ్గిపోయే అవకాశం ఉందని, జూలై మొదటి వారం లోపు పంట వివరాలను సమర్పించాలని అధికారును ఆదేశించామన్నారు.

జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిలువ ఉందని జిల్లాలో తగ్గుతున్న సాగుకు అనుకూలంగా యూరియా బస్తాలు ఉంటాయని, యూరియా కొరత అనే అంశానికి తావు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## నగరాభివృద్ధి పనులపై కమిషనర్ నజర్

ఖమ్మం, జూన్ 20: నగరంలో చేపడుతున్న కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఐఏఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఆర్‌జీ టవర్స్ పరిసరాల్లో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమీక్షించారు. పనుల ప్రస్తుత స్థితి, రాబోయే రోజుల్లో సాధించాల్సిన లక్ష్యాలపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైతే అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తర్వాత ఖమ్మం కిల్లా వద్ద నిర్మాణంలో ఉన్న రోప్‌వే ప్రాజెక్టును కమిషనర్ పరిశీలించారు. నిర్మాణ పురోగతి, చేపడుతున్న పనులు, రానున్న దశల్లో అమలు చేయాల్సిన కార్యాచరణపై టూరిజం శాఖ ప్రతినిధులు, కాంట్రాక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పూర్తి చేసే వరకు దశలవారీగా పురోగతి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసి నగర అభివృద్ధికి వేగం తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## సంక్షేమ సఫలీకృతుడు మంత్రి శ్రీధర్ బాబు..



కరీంనగర్, జూన్ 20: తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్నారని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెందిన 64 చెక్కులు, కళ్యాణలక్ష్మి పథకానికి చెందిన 45 చెక్కులు కలిపి మొత్తం రూ.66,46,320 మంజూరు చేయించారు. ఈ చెక్కులను శనివారం మంథనిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా లబ్ధిదారులకు అందజేయనున్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

రాష్ట్ర రాజకీయాలతో పాటు మంథని ప్రాంత అభివృద్ధి విషయంలోనూ రాజీపడకుండా పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## అనుసంధానం, తాగునీరు, ఆరోగ్యం, విద్య, పర్యాటకం, నీటిపారుదల లాంటి కీలక రంగాల్లో విస్తరించిన ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, జూన్ 20: రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 జూన్ 20న ఒడిశాలో పర్యటిస్తారు. ఇది ఆ రాష్ట్రానికి అరుదైన, ముఖ్యమైన సందర్భం కానుంది.

ఉదయం సుమారు 11:15 గంటలకు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి మయూర్భంజ్ జిల్లాలోని పహాడ్‌పూర్ గ్రామాన్ని సందర్శిస్తారు. సంతాలి జహేరా, హో జహేరా పవిత్ర వనాల్లో ప్రార్థనలు చేస్తారు. నైపుణ్య కేంద్రాన్నీ, పహాడ్‌పూర్ పాఠశాలనూ సందర్శిస్తారు. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా అవకాశాలను బలోపేతం చేయడానికీ, నైపుణ్యాభివృద్ధికీ, సామాజిక-ఆర్థిక సాధికారత సాధనకూ చేపడుతున్న ప్రయత్నాలను ఈ పర్యటన తెలియజేస్తుంది.

ఒడిశా ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మయూర్భంజ్ జిల్లాలోని రాయరంగపూర్‌లో మధ్యాహ్నం సుమారు ఒంటి గంటకు నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి పాల్గొంటారు. “వికాస్ రా ధార, ఒడిశా సార” అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమం జరుగుతుంది. దీనిలో భాగంగా రూ.47,600 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తారు. సభను ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్తు, పారిశ్రామిక మౌలిక వసతులు, రోడ్డు సదుపాయాలు, తాగునీరు, ఆరోగ్యం, విద్య, పర్యాటకం, నీటిపారుదల లాంటి ముఖ్యమైన రంగాలకు చెందిన ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. శంకుస్థాపన చేస్తారు. ఈ ప్రాజెక్టులు ఒడిశాలో మౌలిక వసతులను బలోపేతం చేస్తాయనీ, అనుసంధానాన్ని మెరుగుపరుస్తాయనీ, ఇంధన భద్రతను పెంపొందిస్తాయనీ, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయనీ అంచనా వేస్తున్నారు. సమ్మిళిత, సమగ్రాభివృద్ధి సాధించాలన్న ప్రధానమంత్రి దార్శనికతను ప్రతిబింబిస్తూ.. ఈ ప్రాజెక్టులు గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధిని మరింత వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రతి మూలకూ అభివృద్ధి ప్రయోజనాలను అందిస్తాయి.

600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న ఎగువ ఇంద్రావతి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు, ఐబీ థర్మల్ విద్యుత్ కేంద్రం రెండో దశ విస్తరణ ప్రాజెక్టు శంకుస్థాపన చేసే ప్రధాన కార్యక్రమాల్లో ఉన్నాయి. ఐబీ థర్మల్ విద్యుత్ కేంద్రం రెండో దశలో 660 మెగా వాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లను ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టులు ఒడిశాలో ఇంధన భద్రతను పెంపొందించి, ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయి. ఝూర్సుగూడ జిల్లాలోని లఖన్‌పూర్ వద్ద భారత్ కోల్ గ్యాసిఫికేషన్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (బీసీజీసీఎల్) ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేస్తారు. ఇది దేశీయ బొగ్గు వనరుల స్వచ్ఛ వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ఈ ప్రాంతంలో నూతన పారిశ్రామిక, ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది.

భువనేశ్వర్‌లో రోజుకు 300 టన్నుల సామర్థ్యం కలిగిన, ఆరంభంలోనే వేరు చేసిన మున్సిపల్ ఘన వ్యర్థాల ఆధారిత కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్, కాఠాజోడీ నదిపై కటక్-భువనేశ్వర్‌లను నేరుగా కలిపే వంతెన, బౌధ్ జిల్లాలోని ధల్పూర్-హర్భంగా రహదారిని వెడల్పు చేసి విస్తరించడం, నువాపడ నుంచి ఘటివడ వరకు ఎన్‌హెచ్-353లోని ఒక భాగాన్ని నాలుగు లేన్లుగా విస్తరించడం, కుసుమదిహి మెగాలిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, రాయరంగాపూర్‌లో ఇండోర్ బ్యాడ్మింటన్ కాంప్లెక్స్ తదితరమైనవి శంకుస్థాపన చేసే ప్రాజెక్టుల్లో ఉన్నాయి.

ఒడిశాలోని వివిధ జిల్లాల్లో 24 అటల్ బస్సు స్టాండులు, తొమ్మిది ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లతో పాటు బౌధ్‌లో 300 పడకల జిల్లా ప్రధాన ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఆరోగ్యసేవలను, ప్రజా రవాణా మౌలిక వసతులను బలోపేతం చేస్తాయని భావిస్తున్నారు. ఎన్‌హెచ్-57పై నయాగఢ్ టౌన్ బైపాస్, కుసుమి స్మార్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భూగర్భ పైప్‌లైన్ భాగం, జఖపుర-జాజ్‌పూర్ కియోంఝర్ రోడ్- బైతరణి రోడ్ మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టు, హిందోల్ రోడ్-వెరమండలి మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టు, రాయరంగపూర్‌లోని క్రీడా సముదాయం, గిరిజన పరిశోధనా కేంద్రం మొదలైనవి ప్రారంభించబోయే ముఖ్యమైన ప్రాజెక్టుల్లో భాగంగా ఉన్నాయి.

## రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌దే..



ఖమ్మం, జూన్ 20: రైతును రాజును చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని, రైతు సంక్షేమమే లక్ష్యంగా ఆయన అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు.

మధిరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పంటల కొనుగోలు విషయంలో ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రైతులకు నష్టం కలిగించే విధంగా ఉన్నాయని విమర్శించారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన ప్రతి పంటను కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా రైతులకు భరోసా కల్పించే విధానాలను అమలు చేయాలని సూచించారు.

బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా 11 సార్లు పెట్టుబడి సాయం అందించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మూడుసార్లు మాత్రమే అందించిందని ఆరోపించారు. అలాగే ఎకరానికి అందించే సాయాన్ని కూడా తగ్గించిందని విమర్శించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అనేక హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు.

ఈ సమావేశంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, కనుమూరు వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మొండితోక జయకర్, రంగిశెట్టి కోటేశ్వరరావు, చిత్తారి నాగేశ్వరరావు, బిక్కి ప్రసాద్, వై.వి. అప్పారావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# నత్తనడకన వంద పడకల వైభవం!

## –మారిన ప్రభుత్వాలు.. మారని పేద ప్రజల తలరాతలు



నల్గొండ, జూన్ 20:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే సంకల్పంతో చేపట్టిన వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పాలకుల నిర్లక్ష్యం, నిధుల కొరత కారణంగా నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ భవనం అందుబాటులోకి రాకపోవడంతో స్థానిక ప్రజలతో పాటు, జాతీయ రహదారిపై ప్రమాదాల బారిన పడుతున్న క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న అత్యవసర పరిస్థితి వచ్చినా మెరుగైన వైద్యం అందక హైదరాబాద్‌కు వరుగులు తీయాల్సి వస్తోంది.

హైదరాబాద్ -విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న చౌటుప్పల్ పట్టణం చుట్టుపక్కల సంస్థాన్ నారాయణపురం, గట్టుప్పల్, భూధాన్ పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట, చిట్యాల తదితర మండలాల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలకు, నిత్యం జరిగే ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సాయం అందించేందుకు ఈ ఆసుపత్రి ఎంతో కీలకం. గత మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి బిఆర్ఎస్ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సిఫారసు మేరకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ 100 పడకల ఆసుపత్రిని మొదట రూ. 35.95 కోట్ల (దాదాపు రూ. 36 కోట్లు) అంచనా వ్యయంతో మంజూరు చేశారు.

అయితే, వంద పడకల అత్యాధునిక భవనానికి ఈ నిధులు సరిపోవని భావించి ప్రభుత్వం మరో రూ. 14 కోట్లు అదనంగా మంజూరు చేయడంతో మొత్తం బడ్జెట్ రూ. 50 కోట్లకు చేరింది. 2023 ఏప్రిల్ 17వ తేదీన అప్పటి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, అప్పటి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి లతో కలిసి ఎంతో వైభవంగా ఈ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ శంకుస్థాపన జరిగి గత 17 ఏప్రిల్ కు మూడేళ్లు దాటినప్పటికి నేటికీ పనులు ముగింపునకు నోచుకోకపోవడం గమనార్హం.

మారిన ప్రభుత్వాలు.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

ఆసుపత్రి శంకుస్థాపన అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారాయి. కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విజయం సాధించారు. అయితే ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆసుపత్రి పరిస్థితి మాత్రం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది.

ప్రభుత్వం మారడం, నిధుల కొరత వల్ల బిల్లులు సకాలంలో రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అత్యంత నిమ్మళంగా సాగదీస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రి భవన నిర్మాణం దాదాపు 90 శాతం చివరి దశకు చేరినప్పటికీ, చుట్టూ ప్రహరీ గోడ, రోడ్డు నిర్మాణం, మట్టి కుప్పల తొలగింపు, పరిసరాల పరిశుభ్రత వంటి ఇతర పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నత్తనడకన సాగిస్తున్నారు.

చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు సరైన ప్రభుత్వ ఆసుపత్రి గానీ, నిపుణులైన డాక్టర్లు గానీ లేకపోవడంతో పేద రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏ చిన్న ఎమర్జెన్సీ వచ్చినా వేలాది రూపాయలు అప్పులు చేసి ప్రైవేట్ వాహనాల్లో హైదరాబాద్‌కు వరుగులు తీయాల్సి వస్తోంది. మరీ ముఖ్యంగా 65వ నెంబర్ జాతీయ రహదారిపై నిత్యం ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు సకాలంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు చౌటుప్పల్‌లో వసతులు లేవు. దీనివల్ల ఎంతోమంది విలువైన ప్రాణాలు మార్గమధ్యంలోనే గాల్లో కలిసిపోతున్నాయి. సకాలంలో వైద్యం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతుంటే, వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడి అనాథలుగా మారుతున్నాయి.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మిగిలిన 10 శాతం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభించాలని కోరుతున్నారు. కేవలం భవనాన్ని ప్రారంభించడమే కాకుండా, ప్రభుత్వం కొత్తగా రిక్రూట్ చేసుకుంటున్న వైద్యులను ఈ ఆసుపత్రిలో నియమించాలి. కార్పొరేట్ స్థాయిలో అన్ని రకాల వైద్య సేవలు, అధునాతన స్కానింగ్ సెంటర్లు, ఆపరేషన్ థియేటర్ల సౌకర్యం కల్పించి, నిపుణులైన డాక్టర్లను అందుబాటులో ఉంచాలని చౌటుప్పల్ డివిజన్ పరిసర ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని బలంగా కోరుతున్నారు.

# కుక్కల దాడిలో రెండు మేకలు మృతి



నిజామాబాద్, జూన్ 20: సిరికొండ మండలంలోని కుర్దుల్‌పేట్ గ్రామంలో కుక్కల దాడిలో రెండు మేకలు మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.

బాధితుడు గుజ్జు మహేష్ తెలిపిన వివరాల ప్రకారం, మేకల కొట్టంలో ఉన్న మేకల మందపై వీధి కుక్కలు అకస్మాత్తుగా దాడి చేశాయి. ఈ ఘటనలో రెండు మేకలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో మేక తీవ్రంగా గాయపడింది.

మేకల పెంపకంపైనే జీవనం సాగిస్తున్న తనకు ఈ ఘటనతో ఆర్థిక నష్టం వాటిల్లిందని గుజ్జు మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో మృతి చెందిన రెండు మేకలకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

గ్రామస్థులు కూడా కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, వాటి నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళా సంఘాలకు శాశ్వత భవనం.. నిర్మాణ పనులు ప్రారంభం

## –మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: సర్పంచ్ వసుంధర్



నిజామాబాద్, జూన్ 20:మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని సుదర్శన్‌నగర్ తండా సర్పంచ్ వసుంధర్ అన్నారు. భీమ్‌గల్ మండలం సుదర్శన్‌నగర్ తండాలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా భవన నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మహిళా సంఘాల కోసం శాశ్వత భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. మహిళా సంఘాల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా భవనాల నిర్మాణం చేపట్టడం ప్రభుత్వం వారికి ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని అన్నారు.

మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. శాశ్వత భవనాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సంఘాల కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములై గ్రామాభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు మహిళా సమైక్య భవనాలు..



మహబూబ్‌నగర్, జూన్ 20:మహిళల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు శాశ్వత వేదికగా ప్రతి గ్రామంలో మహిళా సమైక్య సొంత భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని చిన్నపోర్ల సర్పంచ్ గండ్ల నికిత ప్రశాంత్ అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని చిన్నపోర్ల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, పొదుపు సంఘాల కార్యకలాపాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడు తుందని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు నిర్ణయాత్మక స్థాయికి ఎదగాలంటే సంఘటిత శక్తి అవసరమని పేర్కొన్నారు. గ్రామీణ మహిళల అభివృద్ధికి మహిళా సమాఖ్యలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా మరింత సమర్థవంతంగా సేవలందించే అవకాశం ఏర్పడుతుందని అన్నారు.నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. భూమి పూజ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మహిళా సమైక్య భవనం నిర్మాణంతో గ్రామ మహిళలకు ఒక శాశ్వత కార్యాలయం అందుబాటులోకి రానుండటంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ అజయ్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ, సీసీ విజయ్, వివో ఏలు స్రవంతి లలిత తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

## –మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్, జూన్ 20:నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.




నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఇందిరా మహిళా శక్తి భవన్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడుమల్లు రవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్ తదితరులు మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే విస్తృత స్థాయిలో వృక్షారోపణ చేపట్టడం అత్యంత అవసరమన్నారు. మొక్కలు మన జీవితానికి ఆధారమని, అవి ఆక్సిజన్‌ను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటి విజయానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచినప్పుడే కార్యక్రమానికి నిజమైన ఫలితం దక్కుతుందని అన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని కుటుంబ సభ్యుడిలా సంరక్షించాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్రం దేశంలోనే పచ్చదనం పెంపులో ఆదర్శంగా నిలిచిందని, ప్రభుత్వ చర్యల ఫలితంగా అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం, ఆరోగ్యకరమైన జీవన విధానం అందించాలంటే చెట్ల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ప్రకృతి సంపదను పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, ఈ ఏడాది వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 35 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అనంతరం వనమహోత్సవం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేసు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక మాఫియా ఆగడాలు -బీఆర్ఎస్ నాయకుడికి డెత్ థ్రెట్స్

మహబూబ్‌నగర్, జూన్ 20:నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో అక్రమ ఇసుక రవాణా, ఇసుక మాఫియా కార్యకలాపాలపై నిరంతరం గళమెత్తుతున్న బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్ పటేల్ గుర్జాల్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా ప్రాణహాని బెదిరింపులకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

శివరాజ్ పటేల్ గుర్జాల్ తెలిపిన వివరాల ప్రకారం, మండల పరిధిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై తాను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజల తరఫున నిరసనలు వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా మాట్లాడడం మానుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిపారు.

ఫోన్‌లో తనను దుర్భాషలాడుతూ చంపేస్తామని బెదిరించారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను అని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం తన హక్కు అని, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందని, బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఇసుక మాఫియాపై ప్రశ్నలు లేవనెత్తుతున్న వారిని బెదిరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఇంద్రకీలాద్రి పై సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం

విజయవాడ జూన్ 20: శ్రీ సుబ్ర హ్మణ్యేశ్వర స్వామి కారణ జన్ముడు. తారకాసుర సంహారం కోసం జన్మించిన వాడు. సుబ్రహ్మణ్య ఆరాధన వలన మానవులకు శక్తి యుక్తులు సమకూరుతాయిని విశ్వాసం. సుబ్రహ్మణ్యేశ్వరుడు సర్పరూపుడు కావడం వల్ల, సర్పగ్రహాలైన రాహుకేతువులు సుబ్రహ్మణ్య స్వామి ఆధీనంలో ఉంటారని, అందువల్ల సుబ్రహ్మణ్య ఆరాధనం, సుబ్రహ్మణ్య పూజ సర్వ శుభాలనిచ్చి, రాహుకేతు దోషాలకు కూడా పరిహారంగా భావించబడుతోందని పురాణోక్తి. షష్టి నాడు శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం జరిపించడం, వీక్షించడం వలన అవివాహి తులకు వివాహ సంబంధ ఆటంకాలు తొలగి వివాహాలు జరిగి, సత్సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతున్నారు.

విశిష్టమైన ఇంద్రకీలాద్రి క్షేత్రంలో షష్టి రోజున సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం జరిపించిన వారికి సత్సంతాన ప్రాప్తి, రాబోయే తరాలవారికి కూడా సంతాన లేమి లేకుండా వంశాభివృద్ధి జరుగుతుందని భక్తుల విశ్వాసం. షష్టిని పురస్కరించుకుని శనివారం మంగళవాయిద్యములు, వేదపండితుల మంత్రోచ్ఛారణాల నడుమ శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వార్ల కళ్యాణం శాస్త్రోక్తముగా నిర్వహించడం జరిగినది.

# ప్లాస్టిక్ వినియోగం మానేస్తేనే ఆరోగ్యానికి భరోసా..

## –డోకిపర్రులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

అమరావతి, జూన్ 20: ప్లాస్టిక్ వినియోగం కారణం గా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, దాని వినియోగాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు.

స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామంలో నిర్వహించిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

"ప్లాస్టిక్ వాడకు – ప్రాణాలు తీయకు", "ప్లాస్టిక్ బాటిల్ కంటే స్టీల్ బాటిల్ మేలు", "ప్లాస్టిక్ బ్యాగ్ వద్దు – క్లాత్ బ్యాగ్ ముద్దు" వంటి నినాదాలతో ప్రజలను చైతన్యపరిచారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు.



అనంతరం నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోందన్నారు. వేడి టీ, కాఫీ వంటి పానీయాలను ప్లాస్టిక్ కప్పులు, కవర్లలో తీసుకోవడం వల్ల అందులోని రసాయనాలు ఆహారంలో కలిసిపోయి ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని తెలిపారు.గతంలో అరుదుగా కనిపించే క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రస్తుతం ఎక్కువ మందిని వేధిస్తున్నాయని, జీవనశైలి మార్పులతో పాటు ప్లాస్టిక్ వినియోగం పెరగడం కూడా ఇందుకు ఒక కారణమని పేర్కొన్నారు.తన వ్యక్తిగత అనుభవాన్ని గ్రామస్తులతో పంచుకున్న కలెక్టర్, కృష్ణా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రారంభ రోజుల్లో వాహనంలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు వినియోగించేవాడినని, వాటి ప్రభావాన్ని గుర్తించిన తర్వాత స్టీల్ బాటిళ్ల వినియోగాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాను ఎక్కడికి వెళ్లినా సాధ్యమైనంత వరకు పర్యావరణ హిత వస్తువులనే ఉపయోగిస్తున్నట్లు చెప్పారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే పెద్ద మార్పు సాధ్యమవుతుందని అన్నారు. షాపింగ్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగులు, కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసే సమయంలో బుట్టలు, హోటళ్ల నుంచి ఆహారం తీసుకువచ్చే సమయంలో స్టీల్ లేదా ఇతర పునర్వినియోగ పాత్రలు తీసుకెళ్లడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. టీ, కాఫీల కోసం ప్లాస్టిక్ కప్పులకు బదులుగా ఫ్లాస్కులు, స్టీల్ పాత్రలను వినియోగించాలని కోరారు.

# స్త్రీ నిధి రికవరీ, రుణాల పంపిణీ 100 శాతం చేయాలి..

## -పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, జూన్ 20:స్త్రీ నిధి రికవరీని 100 శాతానికి పెంచడంతోపాటు రుణాల పంపిణీని శత శాతం పూర్తి చేసే దిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశం లో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణ చెల్లింపులు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగాలని, అన్ని రికవరీలు మన స్త్రీ నిధి యాప్ ద్వారానే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

లావాదేవీలలో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని స్థాయిలలో యాప్ వినియోగాన్ని మరింత విస్తరించాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే ఎల అంశంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని స్వయం సహాయక సంఘాలపై అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. రికవరీతో పాటు ఇతర విధుల నిర్వహణలో స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బందికి అన్ని స్థాయిలలో పూర్తి సహకారం అందించాలని, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

జూన్ నెలాఖరు నాటికి జిల్లా రికవరీని 70 శాతానికి పెంచాలని, క్రెడిట్ లక్ష్యాన్ని కనీసం 30 శాతానికి చేరేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జీవనోపాధి రుణాల మంజూరును పెంచడంతో పాటు జీరో రికవరీ సంఘాల సంఖ్యను నున్నాకు తీసుకురావాలని సూచించారు. జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, పెద్ద పల్లి మండలాల్లో రికవరీ పనితీరు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జూన్ నెలాఖరు నాటికి గణనీయమైన పురోగతి సాధించేలా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

మహిళల సుస్థిర జీవనోపాధుల అభివృద్ధికి స్త్రీ నిధి రుణాలను సమర్థవంతంగా వినియోగించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ, సకాలంలో రుణ చెల్లింపులు, క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి సహకారం అందించడం అవసరమన్నారు.

ఈ సమావేశంలో డీఆర్డీఓ కాళిందిని, ఏడీఆర్డీఓ రవీందర్, స్త్రీనిధి ఆర్ఎం ఆర్.దుర్గా ప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యకురాలు స్వప్న, కార్యదర్శి శోభా, కోశాధికారి స్వప్న, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు, వివిధ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా, స్త్రీనిధి సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ..

నిజామాబాద్,జూన్ 20: భీంగల్ మండల పరిధి లోని ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్ సేపూర్ చరణ్ గౌడ్ ఆధ్వర్యం లో చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారుల విద్యా భివృద్ధి, ఆరోగ్యం కోసం గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు దుస్తులు అందజేసి వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ టీచర్లు, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అజయ్ గౌడ్, అంగన్వాడీ టీచర్లు పుష్ప, ప్రమీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఉచిత దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్ సేపూర్ చరణ్ గౌడ్కు తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# పశ్చిమబంగ దివస్ సందర్భంగా ప్రధానమంత్రి శుభాకాంక్షలు...

## -డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకున్న శ్రీ మోదీ

న్యూఢిల్లీ, జూన్ 20:పశ్చిమబంగ దివస్ (పశ్చిమ బెంగాల్ దినోత్సవం) సందర్భంగా పశ్చిమ బెంగాల్ ప్రజలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

సాహిత్యం, సంగీతం, కళలు, ఆధ్యాత్మికత, విజ్ఞాన శాస్త్రం, వాణిజ్యం, సామాజిక సంస్కరణలు, ఇతర రంగాల్లో తనదైన సహకారాన్ని అందిస్తూ భారతదేశ చరిత్రను ఎంతగానో ప్రభావితం చేసిన రాష్ట్రాన్ని ఈ రోజు మనం స్మరించుకుంటున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశ జాతీయ చైతన్యాన్ని పశ్చిమ బెంగాల్ అనేక మార్గాల్లో సుసంపన్నం చేసిందని ఆయన గుర్తుచేశారు.

పశ్చిమ బెంగాల్ చరిత్రలో జూన్ 20వ తేదీకి ఎంతో విశిష్టమైన ప్రాధాన్యత ఉందని శ్రీ మోదీ పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, మన దేశంలో అంతర్భాగంగా కొనసాగేలా నిర్ధారించిన రోజు ఇదేనని చెప్పారు. ఈ విషయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోషించిన పాత్ర అమూల్యమైనదని కొనియాడారు. ఈ సంవత్సరం (2026) మనం డాక్టర్ ముఖర్జీ 125వ జయంతిని కూడా జరుపుకుంటున్నామని తెలిపారు.

బెంగాల్ ప్రజల కలలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని ప్రధాని స్పష్టం చేశారు.

పశ్చిమ బెంగాల్ ప్రగతి సాధించాలని, అక్కడ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శ్రీ మోదీ ఆకాంక్షించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు.

"పశ్చిమబంగ దివస్ సందర్భంగా పశ్చిమ బెంగాల్లోని నా సోదరసోదరీలకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

సాహిత్యం, సంగీతం, కళలు, ఆధ్యాత్మికత, విజ్ఞానశాస్త్రం, వాణిజ్యం, సామాజిక సంస్కరణలు వంటి విభిన్న రంగాల్లో తన అద్భుతమైన సహకారం ద్వారా దేశ చరిత్రను లోతుగా మలచిన ఒక రాష్ట్రాన్ని ఈ రోజు మనం స్మరించుకుంటాం. పశ్చిమ బెంగాల్ సమయానుకూలంగా దేశ జాతీయ స్పృహను అనేక విధాలుగా బలోపేతం చేసింది.

నేడు (జూన్ 20) పశ్చిమ బెంగాల్ చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజు. పశ్చిమ బెంగాల్ భారత్లో అంతర్భాగంగా ఉండేలా చేసిన రోజు ఇది. ఇందులో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోషించిన పాత్ర అత్యంత అమూల్యమైనది. ఈ సంవత్సరం మనం డాక్టర్ ముఖర్జీ 125వ జయంతిని కూడా జరుపుకోబోతున్నాం.

ప్రజల కలలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తుంది. పశ్చిమ బెంగాల్ ప్రగతి కోసం, అక్కడి ప్రజల శ్రేయస్సు కోసం నేను ప్రార్థిస్తున్నాను".

# ఉపసర్పంచ్ల చెక్పవర్ రద్దు వార్తలను ఖండించాలి-బొట్ల కార్తీక్



నల్గొండ, జూన్ 20:చెక్పవర్ రద్దు పై వస్తున్న వార్తలను వెంటనే ఖండించాలని రాష్ట్ర ఉపసర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ ప్రభుత్వాన్ని కోరారు.నల్లగొండలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగు నగేష్ ఆధ్వర్యంలో ఈనెల 25న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే హలో ఉప సర్పంచ్.. చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసర్పంచ్ల చెక్ పవర్ రద్దు పై వస్తున్న వార్తలను ఖండించి వార్డ్ మెంబర్లకు నెలకు 3వేలు, ఉప సర్పంచ్ లకు 5వేలు గౌరవ వేతనం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం ప్రకటించని ఎడల ఈ నెల 25 న ఇందిరా పార్క్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ధర్నాకు ఉప సర్పంచులు అంత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్, మట్టా శ్రీనివాస్, కట్టంగూరు మండల అధ్యక్షుడు గోపగాని లింగమ్మ జానయ్య, అయితగోని వెంకటేశం, సతీష్, నవ్య అనిల్ కుమార్ గౌడ్, కదారి కొండల్, నక్క రాజేష్, మర్రి శివ తదితరులున్నారు.

# సోదా శాలినికి ఘనంగా నివాళులు

పరకాల,జూన్ 20: పరకాల ప్రాంత ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు సోదా శాలినికి ఘనంగా నివాళులర్పించారు. పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ అన్న కొడుకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 53వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్ కుమార్ సతీమణి కీ,,శే,, శాలిని మాతృకర్మ శనివారం రోజున ఉదయం 11:30 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల ప్రాంత ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు శాలిని చిత్రపటానికి పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు మాజీ కౌన్సిలర్ పోరండ్ల సంతోష్, జయంత్ లాల్, ఆంధ్రప్రభ విలేకరి రావుల రాజు, బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, నల్లెల్ల అనిల్ కుమార్, తాళ్ల రవీందర్, మునిగంటి విష్ణువర్ధన్, బొచ్చు శ్రీధర్, మంద నరేష్, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డు కోసం పోరాటమే..!

## ఖని-5 ఇంక్లైన్ గేట్ మీటింగ్లో కల్వకుంట్ల కవిత



జయశంకర్ భూపాలపల్లి, జూన్ 20: "గని గర్భంలో చెమట చిందించిన కార్మికుడి ఆరోగ్యమే సంపద ఆ సంపదను కాపాడే మెడికల్ బోర్డులే లేకుంటే పోరాటమే మార్గం" అంటూ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. భూపాలపల్లిలోని కాకతీయ ఖని-5 వద్ద శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్లో కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం మెడికల్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, యాజమాన్యానికి నెల రోజుల గడువు ఇస్తున్నట్లు ప్రకటించిన ఆయన, జూలై 20లోగా మెడికల్ బోర్డుల నిర్వహణపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించకపోతే అదే రోజు గాంధేయ మార్గంలో నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

ప్రస్తుతం సుమారు 1,200 మంది కార్మికులు మెడికల్ బోర్డు పరీక్షల కోసం ఎదురుచూస్తున్నారని, వారి ఆరోగ్య పరిస్థితులు, ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశాలు పెండింగ్లో ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. నెలకు కనీసం రెండు మెడికల్ బోర్డులు నిర్వహించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గతంలో ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో 750 మంది ఇళ్లను కూల్చివేస్తామని ప్రకటించగా, తాము చేపట్టిన నిరాహార దీక్ష ఫలితంగానే 450 మందికి ఇళ్ల పట్టాలు అందాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కూడా ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ, మెడికల్ బోర్డుల నిర్వహణపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కల్వకుంట్ల డిమాండ్ చేశారు. గేట్ మీటింగ్ అనంతరం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర 2047 సాధనే మన లక్ష్యం

## -ప్లాస్టిక్ వ్యర్థాలు ప్రాణికోటికి ప్రమాదకరం : మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



అమరావతి, జూన్ 20: స్వర్ణాంధ్ర - 2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. చెరువు మరువ ప్రాంతంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, ముళ్లకంపలను తొలగించారు. చెరువులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని సందేశం ఇచ్చారు.

అనంతరం విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రమైన గ్రామాలు, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనకు ప్రతిజ్ఞ చేశారు.

ఓడీ చెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన, అభివృద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, చెత్త నిర్వహణపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. చెరువులు, నీటి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు.

మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమికి, జలవనరులకు, ప్రాణికోటికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని అన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలు రైతులకు వరంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీపీఓ సమత, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో శివప్రసాద్ రెడ్డి, అంజనప్ప, హెచ్ఎం శిరీష, ఎంఈఓలు సురేష్, రమణ, టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు తుమ్మల మహబూబ్ బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం, శివారెడ్డి, కంచి సురేష్, మస్తానమ్మతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరంజన్కు రూ.5 లక్షల సాయం

## -బాలుడికి అండగా బండ్ల గణేశ్



హనుమకొండ, జూన్ 20: అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడు నిరంజన్ను ప్రముఖ నిర్మాత బండ్ల గణేశ్ శనివారం పరామర్శించారు. హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లిన బండ్ల గణేశ్ బాలుడికి ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా నిరంజన్ చికిత్స కోసం తన వంతు సహాయంగా రూ.5 లక్షల చెక్కును కుటుంబానికి అందజేశారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంజన్ను కలిసి పరామర్శించిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ సందర్శనతో బాలుడి పరిస్థితి గురించి తెలుసుకున్న అనంతరం తాను కూడా స్పందించి సహాయం అందించినట్లు బండ్ల గణేశ్ తెలిపారు. బండ్ల గణేశ్ చేసిన ఆర్థిక సాయంపై నిరంజన్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మానవత్వాన్ని స్థానికులు, అభిమానులు ప్రశంసిస్తున్నారు.

# జిల్లాకు మరింత గుర్తింపు తేవాలి..

## -ప్రభుత్వ విప్ విజయరమణారావు



పెద్దపల్లి, జూన్ 20: విద్య ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా అగ్రగామిగా నిలిచినందుకు చాలా ఆనందంగా ఉందని, జిల్లాకు మరింత గుర్తింపు తెచ్చేలా పని చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు.

జిల్లాను విద్యా ప్రమాణాల పెంపులో అగ్ర గామిగా నిలిపినందుకు గానూ హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలంగాణ గవర్నర్, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిల చేతుల మీదుగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షని అవార్డు అందు కున్న విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీహర్షను ప్రభుత్వ విప్ విజయరమణారావు శాలువా తో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా ప్రమాణాల పెంపు విషయంలో కా ఎద్దపల్లి జిల్లాకు గుర్తింపు రావడం ఎంతో గొప్ప విషయమని, రానున్న రోజుల్లో పెద్దపల్లి జిల్లాకు మరెన్నో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# “యాచక దశ నుండి తెలంగాణ శాసక దశకు రావాలి”

## జూన్ 21.. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి



తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ (ఆగష్టు 6, 1934– జూన్ 21, 2011) వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామ శివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్ డీ పట్టా పొంది, ప్రిన్సిపాల్ గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్- ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించా4బీ. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పేవారు. జయశంకర్ 2011, జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు.

1934, ఆగస్టు 6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేట లో జయశంకర్ జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత రావు. ఆయనకు ముగ్గురు అన్న దమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించు కోకుండా, తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి, ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయారు.

బెనారస్, అలీగఢ్ విశ్వ విద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీహెచ్ డీ చేశారు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ లోని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేశారు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్ 1991 నుంచి 1994 వరకు ఆదే యూనివర్శిటీకి ఉప కులపతిగా పని చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకునిగా 1954 లో ఫజల్ అలీ కమిషన్ కు నివేదిక ఇచ్చారు. కె.సి.ఆర్ కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశారు. తెలంగాణ లోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారు. జయశంకర్ తన ఆ ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు. “అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్నా బెర్ మర్దనా” (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి. తర్వాత మరణించాలి అని అనేవారు. తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా విదేశాల్లో సైతం వ్యాప్తి చేయడంలో ఆయన పాత్ర మరవ లేనిది. ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ ఉద్యమం లోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించాడు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన అపర మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి, ఆచరించిన మహనీయులు. తెలంగాణ డిమాండ్ ను 1969 నుంచి నిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసిన మేధావి ఆయన.

తెలంగాణ లోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గళాన్ని అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద , విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట యోధులు.

”మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి..!! యాభై ఏళ్లుగా ఇదే ఆకాంక్ష.. ఇదే శ్వాస.. ఇదే లక్ష్యం... ఇదే జీవితం.. ఇందులోనే మరణం!” అని ఉద్యమాన్ని శ్వాసించిన మహె?పాధ్యాయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్, రెండేళ్ల గొంతు క్యాన్సర్ తో బాధపడ్డారు. మీరు చేయాల్సింది మీరు చేశారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఇక ఉండలేను. నేను వరంగల్ కు పోతాను. నన్ను పంపండి” అంటూ ఆయన పుట్టిన గడ్డమీద మమకారంతో వరంగల్ వచ్చారు. ఇంట్లోనే వైద్యులు ఆయనకు అన్నిరకాల వైద్యసేవలు అందించారు. 2011 జూన్ 21న తెల్లవారు జాము నుంచి ఆయన పల్స్ రేట్ పడిపోవడంతో ఆక్సిజన్ అందించారు. చివరకు అదేరోజు ఉదయం 11.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు.

అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్ గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే, జిల్లాలో “విప్లవ విద్యార్థి ఉద్యమానికి” కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమర్జెన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి, ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు

. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తు పెట్టుకోవడం సర్వసాధారణమే కానీ, ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని, పేరు పెట్టి పిలవడం, ఒక్క జయశంకర్ సార్ కు సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి చెప్పేవారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశ విదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు.

వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, ప్రొఫెసర్ కే. సీతా రామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

## కవితక్క కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు

**- ఎల్లారెడ్డిపేటలో టీఆర్ఎస్ ఫ్లెక్సీ కాల్చిన దుండగులను చట్టపరంగా శిక్షించాలి**

**- టీఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ మజీద్**



రాజన్న సిరిసిల్ల, జూన్ 20: (నేటినిజం ప్రతినిధి): ఈనెల 18న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో టిఆర్ఎస్ అధినేత కవితక్క పర్యటనలో జరిగిన జెండా పండుగ, భారీ సభకు ఊహించని విధంగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలపడం జరుగుతుందని, టిఆర్ఎస్ సభ విజయవంతం అయినందున బిఆర్ఎస్ నాయకులు భయభ్రాంతులకు గురవుతూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేసీఆర్ నగర్ వద్ద ఉన్న మండల నాయకుడు కదిరే భాస్కర్ గౌడ్ పెట్టిన ఫ్లెక్సీ ని కాల్చిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారిని శిక్షించాలని శనివారం టిఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ మజీద్ అన్నారు. కవితక్క జిల్లా కేంద్రంలో అడుగుపెట్టగానే కొన్ని పార్టీల నాయకులకు గుండెల్లో గుబులు పడుతుందన్నారు. జిల్లాలోని పలు మండలాలలో గల జనం స్వచ్ఛందంగా తరలివచ్చి కవితక్కకు స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహించి మా ఆడబిడ్డ విజయం సాధించాలని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా కవితక్కను చూడాలని ఉందని ఓ ఆడబిడ్డ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే మహిళలకు ఎంతో న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేలాదిమంది కవితక్క సభకు తరలిరాగా ఎల్లారెడ్డిపేట మండల బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక సభ జరిగిన అర్థరాత్రి వేళలో మండల కేంద్రంలోని కెసిఆర్ నగర్ వద్ద టిఆర్ఎస్ నాయకుడు కదిరే భాస్కర్ గౌడ్ అమర్చిన ఫ్లెక్సీని తగలబెట్టడం మూర్ఖత్వమని అన్నారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరిస్తూ పార్టీల పైన ద్వేషం పెంచుకొని తప్పుడు పనులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని సిరిసిల్ల సభ జరగకుండా కొన్ని అడ్డంకులు సృష్టించిన కూడా ప్రజా స్పందన ముందు తామే గెలిచి సభను విజయవంతం చేయడం జరిగిందని అన్నారు. ఫ్లెక్సీ కాల్చిన వ్యక్తులపైన చట్టపరమైన శిక్షలు విధించాలని టిఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ మజీద్ కోరారు.

## త్వరలోనే వేములవాడ బైపాస్ రోడ్డుకు సరికొత్త వెలుగులు..



**చైర్మన్ పుల్కం రాజు**

**ప్రమాదాల నివారణకే బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు**

**పట్టణాభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పన..**

**మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

రాజన్న సిరిసిల్ల, జూన్ 20: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే రహదారుల ఆధునీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు.

ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ బైపాస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డు పొడవునా జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైరింగ్ పనులను వారు దగ్గరుండి వీక్షించారు.

ఈ సందర్భంగా పనుల నాణ్యత, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో, నిర్ణీత గడువులోగా పనులన్నీ ముగించి వెలుతురును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బైపాస్ రోడ్డులో సెంటర్ లైటింగ్ అందుబాటులోకి వస్తే చీకటి కారణంగా జరిగే రహదారి ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని, వాహనదారులకు మెరుగైన వెలుతురు లభించి ప్రయాణం ఎంతో సురక్షితంగా మారుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

పట్టణ ప్రజలతో పాటు వేముల వాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో త్వరలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని మున్సిపల్ చైర్మన్ వివరించారు.

## మానవతా సేవలో పోలీసు శాఖ..

**“మా” అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ.**

**వృద్ధులకు పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ.**



రాజన్న సిరిసిల్ల, జూన్ 20: (నేటినిజం ప్రతినిధి): . గంభిరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని “మా” అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని శనివారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సందర్శించారు.

ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు,అవసరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు,బియ్యం,కిరాణా సరుకులు మరియు ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సమాజంలో వృద్ధులు, నిరాశ్రయులు,అనాథల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

వృద్ధుల సేవ చేయడం గొప్ప మానవతా ధర్మమని, వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. అవసరమైన వారికి సేవలు అందించడంలో జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ శ్రీకాంత్ వృద్ధాశ్రమ సభ్యులు ఉన్నారు.

## రైతు నుగూరే పాండురంగ్ కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్



ఆదిలాబాద్, జూన్ 20: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామంలో కాంగ్రెస్ సర్కార్ పంట కొనక పోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న రైతు నుగూరే పాండురంగ్ (48) కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. రైతు పాండురంగ్‌కు నివాళులర్పించిన కేటీఆర్ వారికుటుంబసభ్యులను ఓదార్చారు. పాండురంగ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

నుగూరే పాండురంగ్ పొన్న గ్రామంలో తాను పండించిన జొన్న పంటను విక్రయించేందుకు మే 23న తేదీన సిరికొండ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లారు. హమాలీలకు డబ్బులు చెల్లించిన అనంతరం లారీలో లోడ్ చేసేందుకు అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది డిమాండ్ చేసింది. తన దగ్గర డబ్బులు లేవని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, పది రోజులైనా జొన్నలు లోడ్ చేయలేదని మనస్తాపంతో పాండురంగ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిసిందే.

## 5వ వార్డులో ప్రతి ఇంటికి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం




రాజన్న సిరిసిల్ల, జూన్ 20: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛమైన, పరిశుభ్రమైన వార్డు నిర్మాణ లక్ష్యంతో ప్రతి ఇంటికి చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 5వ వార్డు వార్డు కౌన్సిలర్ వాసాల లావణ్య శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రజలకు చెత్త బుట్టలను అందజేశారు. ఈ సందర్భంగా వాసాల లావణ్య శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటి వద్దే చెత్తను సక్రమంగా సేకరించి, తడి మరియు పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ పంపిణీ చేస్తున్నట్టు, ప్రజలకు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, మున్సిపాలిటీ అందించిన చెత్త బుట్టలను వినియోగించి పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు.అలాగే, ప్రతి కుటుంబం స్వచ్ఛతను తమ బాధ్యతగా భావించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని, పరిశుభ్రమైన వార్డు నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన కార్యక్రమాన్ని అభినందిస్తూ పరిశుభ్రత పరిరక్షణకు తమ వంతు సహకారాలు అందిస్తామని అన్నారు. పట్టిన అనంతరం మున్సిపల్ సిబ్బంది కలిసి ఇంటింటికీ వెళ్లి చెత్త బుట్టలను పంపిణీ చేస్తూ, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్‌పల్లిలో పిచ్చికుక్క దాడిలో 14 మందికి గాయాలు

కరీంనగర్, జూన్ 20: సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని గణేష్‌పల్లి లో శుక్రవారం అర్ధ రాత్రి పిచ్చికుక్క దాడిలో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు.. రాత్రి గాయపడిన వారిని జగిత్యాల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

స్థానికుల కథనం ప్రకారం.. గణేష్‌పల్లిలో గ్రామంలో ఎండాకాలం కావడంలో గ్రామస్తులు ఆరుబయట మంచాలు వేసుకుని నిద్రిసున్నారు. అర్ధరాత్రి 12:30 సమయంలో పిచ్చి కుక్క ఒక్కసారిగా నిద్రిస్తున్న వారిపై పడి దాడిచేసింది. ఈ దాడిలో ఐదుగురు మహిళలు, ఆరు సంవత్సరాల బాబు, ఎనిమిది మంది పురుషులు గాయపడ్డారు. కాగా వీరిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వారికి చికిత్స పొంతుతున్నారు.




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.